సాక్షి పెద్దపల్లి

బుధవారం । 5 । జూలై । 2023



పత్తి క్వింటాల్‌కు రూ.6,645

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మార్కెట్‌లో పత్తి క్వింటాల్‌కు మంగళవారం రూ.6,645 పలికింది. కనిష్టంగా రూ.6,008, సరాసరి రూ.6,528గా నమోదైందని ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.



ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

8లో▸

ప్రమాదాల నివారణ ప్రతిఒక్కరి బాధ్యత అని కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య, ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ తెలిపారు.

గరిష్ఠం/కనిష్ఠం
35.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని కొన్నిచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

తెలంగాణ యోధుడు దొడ్డి కొమురయ్య



దొడ్డి కొమురయ్యకు నివాళి అర్పిస్తున్న కలెక్టర్ సంగీత

పెద్దపల్లిరూరల్: తెలంగాణ రైతులపై జరిగిన అకృత్యాలను ఎదురించి పోరాడిన తొలి వ్యక్తి దొడ్డి కొమురయ్య అని కలెక్టర్ సంగీత అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ నిర్వహించిన కొమురయ్య వర్ధంతిలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, కుమార్ దీపక్‌తో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొమురయ్య మరణంతో రైతాంగ ఉద్యమం సాయుధ విప్లవంగా మారిందన్నారు. జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రంగారెడ్డి, డీఆర్‌డీవో శ్రీధర్, కుర్మ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ



జ్ఞాపిక అందజేస్తున్న అధికారులు

రామగుండం: జిల్లా కేంద్రంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు పాఠశాల విద్యార్థులకు 'ఆర్థిక అక్షరాస్యత–2023' అంశంపై ఆలిండియా క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలను సోమవారం ప్రకటించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థినులు ప్రథమ బహుమతి టి.రంకిత, అఫ్రీన్ సాధించారు. విజేతలకు ఆర్‌బీఐ రూ.10వేల నగదు అందించారు. విజేతలను హైస్కూల్ హెచ్‌ఎం.తానం స్వర్ణ, గైడ్ టీచర్ బి.బేబీరాణి, ఉపాధ్యాయ బృందం అభినందించింది.

సమస్యల పరిష్కారానికి సమ్మె



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: అపరిష్కృతంగా ఉన్న గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. రెండేళ్లుగా పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వం గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, జీవోనంబర్ 60 ప్రకారం కనీస వేతనం నెలకు రూ.15,600 చెల్లించాలన్నారు. నాయకులు ఎండీ.ఖాజా, మామిడిపల్లి తిరుపతి, ఎండీ.ముస్తఫా, పి.చంద్రయ్య, ఎండీ.రహీం తదితరులు పాల్గొన్నారు.

రైతులు అధైర్యపడొద్దు



కంది విత్తనాలు, పురుగు మందులు అందిస్తున్న డీఏవో

కమాన్‌పూర్: వర్షభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు అధైర్యపడొద్దని జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి అన్నారు. మండలంలోని లింగాల రైతు వేదికలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు కంది విత్తనాలను పంపిణీ చేశారు. జిల్లాలో ఇప్పటివరకు తక్కువ వర్షపాతం నమోదైందని తొలకరితో దుక్కులు దున్ని, నార్లు పోసుకున్నారని పేర్కొన్నారు. వారం పదిరోజుల్లో ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి ప్రాజెక్టుల నుంచి సాగునీరు విడుదలకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తుందని, అప్పటివరకు బావులు, బోర్ల సహాయంతో పంటలు కాపాడుకోవాలని సూచించారు. ఈ ఏడాది వర్షభావ పరిస్థితులు నెలకొంటాయని వాతావరణ శాఖ సూచనల మేరకు రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు. కేవీకే ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా కంది విత్తనాలు, పురుగుమందులు అందించడం సంతోషంగా ఉందన్నారు. కమాన్‌పూర్ ఏవో బండి ప్రమోద్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు శ్రీనివాస్, భాస్కర్‌రావు, వెంకన్న, కిరణ్, వినోద్, ఏఈవోలు శ్రీనివాస్, సురేష్, శ్రీధర్ రైతులు పాల్గొన్నారు.

కొత్త మండలాలపై ఆశలు



గర్రెపల్లి మేజర్ గ్రామపంచాయతీ

ఎన్నో ఏళ్ల కల గర్రెపల్లి

తొమ్మిది గ్రామ పంచాయతీలు, ఐదు ఎంపీటీసీ స్థానాలు, 20వేలకుపైగా జనాభా.. అందుబాటులోనే ప్రభుత్వ భూములు ఉన్న గర్రెపల్లిని మండలం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. గర్రెపల్లి మండలం కావడానికి అన్ని అర్హతలూ ఉన్నాయని, తొమ్మిది గ్రామాలు, రెవెన్యూ విలేజీల్లో ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నాయని, పైగా రాజీవ్‌రహదారి వెంబడి ఉన్న క్రమంలో గర్రెపల్లిని మండల కేంద్రంగా గుర్తించాని ప్రజలు కోరుతున్నారు.

- గర్రెపల్లి, గుంజపడుగు కోసం స్థానికుల పట్టు
- ప్రభుత్వానికి ఆయా ప్రాంతాల ప్రజల వినతి
- ప్రతిపాదనలు పంపించామంటున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి
- 6 నుంచి నిరవధిక దీక్షకు దిగుతున్న గర్రెపల్లి వాసులు

భారమంతా వారిపైనే..

గర్రెపల్లి పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఇలాఖాలోకి వస్తుంది. గుంజమడుగు జెడ్పీ చైర్మన్ ఇలాఖాలో ఉంది. దీంతో అటు గర్రెపల్లి ప్రజలు ఎమ్మెల్యే దాసరిపై.. ఇటు గుంజపడుగు ప్రజలు పుట్ట మధుపై భారం వేశారు. ఇప్పటికే ఎమ్మెల్యే దాసరి మండలం ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని కలెక్టర్‌కు లేఖ రాశారు. గుంజమడుగు వాసులు మాత్రం పుట్ట మధు అంతా చూసుకుంటారనే భరోసాతో ఉన్నారు. మరి ఇద్దరు ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తారా? లేదా? అనేది తేలాల్సి ఉంది. పొరుగు జిల్లాల్లో కొత్త మండలాలు ఏర్పాటు జరుగుతున్న నేపథ్యంలో ఈ అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలో కొత్త మండలాలు కావాలనే డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. పరిపాలనా సౌలభ్యం కోసం మండలాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. రాష్ట్రంలో కొత్తగా జయశంకర్‌భూపాలపల్లి, రంగారెడ్డి జిల్లాలో మండలాలు ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయడం.. జగిత్యాల జిల్లాలోని బండలింగాపూర్‌ను మండలకేంద్రంగా గుర్తించేందుకు ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేయడంతో జిల్లాలోనూ కొత్తగా మరో రెండు మండలాల కోసం పట్టుబట్టుతున్నారు.ఈ డిమాండ్ ఇప్పటిదే కాదు.. ఏళ్ల తరబడి ప్రజలు కోరుతున్నా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పట్టించుకోలేదు. జిల్లాలో ఇప్పటికే 14 మండలాలు, 3 రెవెన్యూ డివిజన్లు ఉండగా.. మరో రెండు మండలాల కోసం స్థానిక నేతలు, ప్రజలు ప్రభుత్వానికి వినతులు అందిస్తున్నారు. సందర్భం వచ్చినప్పుడల్లా ఆందోళనలు చేస్తూ ఒత్తిడి తెస్తున్నారు. ఈ నేపథ్యంలో గర్రెపల్లి మండలం కోసం పార్టీలకతీతంగా ఈనెల 6 తేదీ నుంచి ప్రజలు నిరవధిక దీక్షకు సిద్ధమవుతున్నారు. దీంతో కొత్త మండలాల అంశం తెరపైమీదకు వచ్చినట్లయ్యింది.

గుంజపడుగు సాధన సమితితో..

మంథని మున్సిపాలిటీ తరువాత అధిక జనాభా ఉన్న గుంజపడుగు గ్రామాన్ని మండలకేంద్రం చేయాలని, చుట్టూ ఉన్న ఉప్పట్ల, పోతారం, విలోచవరం, మల్లెపల్లి, నాగారం, కన్నాల, రచ్చపల్లి, ఆడ్యాల, అక్కెపల్లి, సిద్ధపల్లి, సిరిపురం, దుబ్బపల్లి, చిప్పపల్లి, బెస్తపల్లి, రామగిరి మండలంలోని చందనాపూర్, సింగిరెడ్డిపల్లి, పెద్దంపేట, సుందిళ్ల, ముస్త్యాల గ్రామాలను గుంజపడుగులో కలపాలని స్థానికంగా డిమాండ్ వినిపిస్తోంది. మంథని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటైన నాటి నుంచి ఈ కోరిక ప్రజల్లో బలంగా ఉంది. పైగా మండల సాధన సమితి పేరుతో ఎప్పటినుంచో ఉద్యమాలు చేస్తున్నారు. మండలానికి కావాల్సిన అన్ని అర్హతలూ ఉన్నాయని, జిల్లాల పునర్విభజన సమయంలోనే ప్రతిపాదనలు పంపినా ఏర్పాటు చేయలేదని గుర్తు చేస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం స్పందించి గర్రెపల్లి, గుంజపడుగు గ్రామాలను మండలాలుగా ప్రకటించాలని ఆయా ప్రజలు విజ్ఞప్తులు అందిస్తున్నారు.

నమ్మకం ఉంది



గర్రెపల్లిని మండలంగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందనే నమ్మకం ఉంది. ఇప్పటికే ఎమ్మెల్యే దాసరి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. గర్రెపల్లి మండలం కావడానికి అన్ని అర్హతలున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు కావల్సిన ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్నాయి.

– వీరవని రమేశ్, సింగిల్ విండో మాజీ చైర్మన్, గర్రెపల్లి

మండలంగా ప్రకటించాలి



శాతవాహనులు, కాకతీయులు ఇక్కడి నుంచి పరిపాలన కొనసాగినట్లు ఆనవాళ్లు చెబుతున్నాయి. పక్కనే గోదావరి నది, పుణ్యక్షేత్రాలు, జనాభా తదితర అర్హతలతో గోదావరిఖని–మంథని ప్రధాన రహదారిపై ఉన్న గుంజపడుగను మండలంగా ఏర్పాటు చేస్తే ఇక్కడి ప్రాంతం అభివృద్ధి చెందుతుంది.

– అందె సదానందం, గుంజపడుగు



హమ్మయ్యా.. వర్షం కురిసింది

- జిల్లావ్యాప్తంగా భారీ వర్షం
- జిల్లాకేంద్రంలో లోతట్టు ప్రాంతాలు జలమయం

చాలా రోజుల తర్వాత జిల్లాను వరుణుడు పలకరించాడు. మధ్యాహ్నం ప్రారంభమైన వర్షం గంటపాటు కుండపోతగా కురిసింది. జిల్లావ్యాప్తంగా మోస్తరు వర్షం కురవడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాకేంద్రంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పెద్దపల్లి బస్టాండ్ ఆవరణంతా వరదనీటితో నిండిపోయింది. నాటిన పత్తి విత్తనాలు మొలకెత్తుతాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పాలకుర్తి మండలం బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ సమీపంలో రహదారిపై చెట్లు విరిగిపడటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. హెచ్‌కెఆర్ టోల్‌ప్లాజా సిబ్బంది యంత్రాల సహాయంతో తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. రామగుండం రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫారంపై షెడ్డు మధ్య నుంచి వరద నీరు పడుతుండడంతో ప్రయాణికులు ఇక్కట్లకు గురయ్యారు. – సాక్షి నెట్‌వర్క్



జూలపల్లి: వర్షంలో నృత్యం చేస్తున్న యువకులు



పెద్దపల్లి బస్టాండ్ ఇన్‌గేట్ వద్ద భారీగా నిలిచిన వరద నీరు

అమెరికా పారిశ్రామికవేత్తలతో కోరుకంటి భేటీ



సాఫ్ట్‌వేర్ అధిపతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: రామగుండంలో తమ శాఖలను ఏర్పాటుచేసేందుకు పలువురు పారిశ్రామిక వేత్తలు ముందుకొచ్చినట్లు ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. నియోజకవర్గంలోని నిరుద్యోగులకు శాశ్వత ఉద్యోగ, ఉపాధి కల్పనలో భాగంగా ఇక్కడ ఐటీపార్క్ ఏర్పాటుకు నిర్ణయించిన విషయం తెల్సిందే. పార్క్‌కు సహకరించాలని కోరేందుకు ఎమ్మెల్యే అమెరికా వెళ్లారు. డల్లాస్‌లో రామగుండంకు చెందిన ఐటీ సంస్థ డైరెక్టర్ వేణు సంగాని, తెలంగాణ ప్రాంతానికి చెందిన పలువురితో చందర్ సమావేశమయ్యారు. తమ ప్రాంతంలో ఐటీలో శిక్షణ పొందిన, నైపుణ్యం కలిగిన యువత అందుబాటులో ఉన్నారని, ఐటీ పార్క్ ఏర్పాటుకు అవసరమైన వసతులను కల్పిస్తామని ఎమ్మెల్యే వారికి భరోసా ఇచ్చారు. దీనిపై తమ శాఖలు ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశారని, మొదటి దశ సుమారు 50 నుంచి వందమంది ఐటీ నిపుణులకు అవకాశం వస్తుందని చందర్ ఆశాభావం వ్యక్తం చేశారు. అన్నీ అనుకూలిస్తే ఆగస్టులో మంత్రి కేటీఆర్‌తో ఐటీ పార్క్ శిలాఫలకాన్ని ఆవిష్కరించి, పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఐదు రోజుల పర్యటన అనంతరం అమెరికా నుంచి ఎమ్మెల్యే స్వదేశానికి పయనమయ్యారు.

హరితహారం లక్ష్యాలు అధిగమించాలి



వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్, అడిషనల్ కలెక్టర్

పెద్దపల్లిరూరల్: హరితహారం కింద జిల్లాలో నిర్దేశించుకున్న 9లక్షల మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని కలెక్టర్ సంగీత అన్నారు. పంచాయతీలకు పక్కాభవనాలు, కులవృత్తిదారులకు ఆర్థికసాయం వంటి అంశాలపై మంగళవారం కలెక్టరేట్ నుంచి అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇప్పటివరకు 50వేల గుంతలు తవ్వించినట్లు అధికారులు పేర్కొన్నారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ పరిధిలో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పంచాయతీ భవనాలు మూడునెలల్లో పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. బీసీ కులవృత్తుల సాయం పథకానికి 10,759 మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో 6,797మందిని అర్హులుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. ప్రతినెలా 15న ప్రజాప్రతినిధుల సమక్షంలో అర్హులకు సాయం అందిస్తామన్నారు. సమావేశంలో డీఆర్‌డీఓ శ్రీధర్, డీపీఓ చంద్రమౌళి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రంగారెడ్డి తదితరులున్నారు.

ఉపకార వేతనాలు విడుదల చేయండి

పెద్దపల్లిరూరల్: పెండింగ్ ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ కార్యాలయం ముందు ఏబీవీపీ నాయకులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదలచేయాలని పరిషత్ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రూ.5,300 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో బోధన, బోధనేతర ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేల్పుల నాగచంద్ర, మనీషా, రాసూరి ప్రవీణ్, ఓమేశ్, రిషి, అరవింద్, అభి, రాకేష్, శ్రీనివాస్, ఉదయ్ తదితరులున్నారు.

కొంచెం మోదం.. ఎంతో ఖేదం..!

- చేరికల కమిటీ చైర్మన్‌గా ఇంతకాలం ఈటల కినుక
- చివరికి ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా పదోన్నతి
- పార్టీ అధ్యక్షుడిగా బండి సంజయ్‌ది తిరుగులేని ముద్ర
- పాదయాత్రలు, అరెస్టులతో జాతీయస్థాయిలో చర్చ
- బండిని తప్పించడంపై జిల్లా నేతల అసంతృప్తి
- త్వరలో కేంద్ర కేబినెట్‌లోకి ఎంపీ బండి సంజయ్?



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి విషయంలో పార్టీలో కొంతకాలంగా సాగుతున్న ప్రతిష్టంభనకు ఎట్టకేలకు తెరపడింది. కరీంనగర్ ఎంపీగా పార్టీ అధ్యక్షుడిగా ఇంతకాలం బీజేపీకి తిరుగులేని విజయాలు అందించిన బండి సంజయ్ స్థానంలో కిషన్‌రెడ్డిని నియమిస్తూ పార్టీ అధిష్టానం ఆదేశాలు జారీచేసింది. జిల్లా నుంచి పెద్దలీడర్‌ను కీలక బాధ్యతల నుంచి తప్పించినా.. మరో కీలక పదవి కూడా ఇదే జిల్లాకు చెందిన సీనియర్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను వరించింది. ఇంతకాలం చేరికల కమిటీ చైర్మన్‌గా ఉన్న ఈటలను రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా పదోన్నతి కల్పించింది. బండిని తప్పించడం, ఈటలకు పదోన్నతి కల్పించడం వంటి పరిణామాలతో పార్టీ, ‘బండి’ వర్గంలో తీవ్ర నిస్తేజం నెలకొనగా.. ఈటల వర్గంలో కొత్త ఉత్సాహం మొదలైంది. మొత్తానికి పార్టీలో జిల్లా నేతలకు పదవులు మారినా.. అధిష్టానం వద్ద పట్టునిలుపుకోవడంలో కరీంనగర్ నాయకులు మరోసారి సత్తా చాటుకున్నట్లయింది.

ఫలించిన ఈటల మంత్రాంగం..!

జిల్లాలో సీనియర్ మంత్రిగా, ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఈటల రాజేందర్‌ది సుదీర్ఘ రాజకీయ అనుభవం. టీఆర్‌ఎస్‌లో చేరి అనతికాలంలో కేసీఆర్‌కు కుడిభుజంలా మారారు. తెలంగాణ ఉద్యమంలో ఈటల రాజేందర్ పాత్ర ప్రజలందరికీ తెలిసిందే. 2004లో టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఈటల రాజేందర్ ఆపై వెనుదిరిగి చూసుకోలేదు. 2004, 2008, 2009, 2010, 2014, 2018, 2021లో రాష్ట్రంలో మొత్తం ఏడుసార్లు అసెంబ్లీకి ఎన్నికైన ఏకైక ఎమ్మెల్యేగా ఈటల రాజేందర్‌ది తిరుగులేని రికార్డు. ఇందులో 2008, 2009, 2010లో ఏడాదికి ఒకసారి చొప్పున అసెంబ్లీకి గెలుస్తూ హ్యాట్రిక్ సాధించారు. 2021లో మరో ఉప ఎన్నికలో విజయం సాధించి అత్యధిక ఉప ఎన్నికలు గెలిచిన ఎమ్మెల్యేగా రికార్డు సొంతంచేసుకున్నారు.

- 2021లో అనూహ్య పరిస్థితుల మధ్య టీఆర్‌ఎస్‌ను వీడిన రాజేందర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. అనంతరం జరిగిన ఉప ఎన్నికలో బీజేపీ నుంచి విజయం సాధించారు. బీజేపీలో చేరికల కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. వాస్తవానికి రాజేందర్‌ను పార్టీ అధ్యక్షపదవి వరిస్తుందనుకున్నా.. జరగలేదు. ఈ క్రమంలో ఆయన అధిష్టానంపై ఒత్తిడి ప్రారంభించారు. బండికి వ్యతిరేకంగా సీనియర్లను కూడగట్టేందుకు యత్నించారు. ఒకదశలో పార్టీని వీడుతారని ప్రచారం జరిగింది. మొత్తానికి రాజేందర్ వ్యూహం ఫలించింది. పార్టీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా నియమించడంతో ఈటల వర్గీయుల ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బండిని తప్పించడంపై నిరాశ..

బీజేపీకి కొత్త ఊపు తీసుకువచ్చిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో ఒక సంచలనం. సంఘ్ పరివార్ నేపథ్యమున్న బండి 2019 ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీగా అనూహ్య విజయం సాధించారు. 2020లో రాష్ట్ర అధ్యక్ష పదవి చేపట్టిన బండి సంజయ్ పార్టీకి కొత్త జోష్ నింపారు. రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో తొలి ఉపఎన్నిక దుబ్బాకలో బండి సంజయ్ నేతృత్వంలో పార్టీ ఎలాంటి పొత్తులు లేకుండా విజయం సాధించి రికార్డు సృష్టించింది. అనంతరం బండి తన దూకుడును జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో అదేస్థాయిలో కొనసాగించారు. ఏకంగా 46 కార్పొరేటర్ స్థానాల్లో కాషాయజెండా ఎగరేసి అధికార పార్టీకి చెమటలు పట్టించారు. 2021 హుజూరాబాద్ ఎన్నికలోనూ ఈటల రాజేందర్ గెలుపుతో బండి గ్రాఫ్ మరింత పెరిగింది. 2022 జనవరి 317 జీవోకి వ్యతిరేకంగా బండి చేపట్టిన దీక్షను పోలీసులు భగ్నం చేయడం జాతీయస్థాయిలో చర్చ జరిగింది. ఇటీవల పదో తరగతి పేపర్ లీకేజీలు, భైంసా సభ సమయంలోనూ బండిని పోలీసులు అరెస్టు చేయడం రాష్ట్రవ్యాప్తంగా కేడర్‌ను ఏకంచేశాయి. 2022 మునుగోడు ఉపఎన్నికల్లోనూ బీజేపీ చివరి వరకు పోరాడింది. ప్రజాసంగ్రామ యాత్రలతో కేవలం తన పార్లమెంటు సెగ్మెంటులోనే కాకుండా.. రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి పార్టీకి కొత్త రక్తాన్ని ఎక్కించారు. అప్పటిదాకా 10 శాతంగా ఉన్న బీజేపీ ఓటు షేర్‌ను 34.5 శాతానికి పెంచారు.

త్వరలో కేంద్ర కేబినెట్‌లోకి..

అదే సమయంలో బండి జిల్లాలో సీనియర్లను కలుపుకొనిపోవడంలో విఫలమయ్యారన్న విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా కరీంనగర్ కార్పొరేషన్‌లో ఫ్లోర్ లీడర్‌ని నేటికీ నియమించకపోవడంపైనా పలు ఆరోపణలు ఉన్నాయి. అదే సమయంలో పార్టీలో నగర అధ్యక్షుడిని నియమించకుండా ఈస్ట్, వెస్ట్, సౌత్, నార్త్, సెంట్రల్ అంటూ జోన్లు విభజించి ఎవరికీ పట్టు దక్కనీయలేదని విమర్శలు ఎదుర్కొంటున్నారు. అదే సమయంలో బండి నిర్ణయాలను సమర్థించే ఫాలోవర్లకు కొదవలేదు. బండిని అధ్యక్ష పదవి నుంచి తప్పించడాన్ని వ్యతిరేకిస్తూ.. సోషల్ మీడియా హోరెత్తి పోతోంది. నగర పశ్చిమ డివిజన్ కార్యవర్గం రాజీనామా చేయడం గమనార్హం. రెండుమూడురోజుల్లో బండి సంజయ్‌ని కీలక పదవి వరించనుందని సమాచారం. కేంద్ర కేబినెట్‌లో బండికి చోటుదక్కనుందని పార్టీ వర్గాల సమాచారం.

క్లుప్తంగా

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి


మహేశ్ (ఫైల్)

ధర్మారం: మండలంలోని బంజేరుపల్లి శివారులో మంగళవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో కరీంనగర్ మండలం బొమ్మకల్‌కు చెందిన జక్కినపల్లి మహేశ్ (36) మృతి చెందాడు. మహేశ్ ధర్మపురికి వెళ్లి ద్విచక్రవాహనంపై ఇంటికెళ్తుండగా.. బంజేరుపల్లి శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. మృతుడి తల్లి పోచమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మహేశ్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలోని ఉదయ్‌నగర్‌కు చెందిన కుక్క మహేశ్ (28) ఉరేసుకుని ఆత్మహత్య పాల్పడ్డాడు. ఆస్తిలో తన వాటా తనకు ఇవ్వాలని ప్రతిరోజూ తల్లితో గొడవపడుతున్నాడు. తల్లి ఒప్పుకోకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై మహేందర్ తెలిపారు. మృతుడి భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రిటైర్డ్ కార్మికుడి ఇంట్లో చోరీ

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ పోతనకాలనీకి చెందిన సింగరేణి కార్మికుడు మాతంగి రాజేశ్వర్ నివాసం ఉంటున్న 27 బ్లాక్–373 క్వార్టర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గోదావరిఖని టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. రాజేశ్వర్‌కు ఇద్దరు కుమారులు, కూతురు సంతానం. కుమారులు హైదరాబాద్‌లో, కూతురు యైటింక్లయిన్‌కాలనీలో నివాసముంటోంది. భార్య ఈనెల 2న కుమారుల వద్దకు వెళ్లింది. రాజేశ్వర్ కూతురు వద్దకు వెళ్లాడు. మంగళవారం పాల వ్యక్తి రాజేశ్వర్‌కు ఫోన్ చేసి ఇంటి తాళం పగులగొట్టి ఉందని ఫోన్ చేసి చెప్పడంతో వెంటనే కూతురుతోపాటు ఇంటికి చేరుకుని పరిశీలించగా.. బీరువాలోని వస్తువులు చిందరవందరంగా పడి ఉన్నాయి. బీరువాలోని 18గ్రాములు బంగారం గొలుసు, వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు పేర్కొన్నారు. వాటి విలువ మొత్తం రూ.78వేల వరకు ఉంటుందని బాధితుడు రాజేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

బాలికను బెదిరించిన బాలుడు

గోదావరిఖని: గోదావరిఖనిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినిని గతంలో అదే పాఠశాలలో చదివిన ఓ బాలుడు బెదిరించిన ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. బాలిక ఉదయం పాఠశాలకు వెళ్తున్న క్రమంలో బాలుడు దురుసుగా ప్రవర్తించడంతో పాఠశాల యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు చేరుకుని బాలుడికి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిసింది. దీనిపై పోలీసులను వివరణ కోరగా.. కేసు నమోదు కాలేదన్నారు.

రాజీవ్ రహదారి రక్తసిక్తం

- ట్రాక్టర్ ఢీకొని ముగ్గురు యువకుల దుర్మరణం
- మరో వాహనం సైతం ఢీకొన్నట్లు అనుమానం
- మృతులది చిగురుమామిడి మండలం రామంచ
- రాంగ్‌రూట్ కారణంగా ప్రమాదం
- గ్రామంలో విషాదఛాయలు

తిమ్మాపూర్: తిమ్మాపూర్ మండలం రేణికుంట శివారులోని రాజీవ్‌రహదారి నెత్తురొడింది. ద్విచక్రవాహనంపై వెళ్తున్న ముగ్గురు యువకులను రాంగ్ రూట్‌లో వచ్చిన ట్రాక్టర్, మరో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతిచెందారు. ఎల్ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి కథనం ప్రకారం.. చిగురుమామిడి మండలం రామంచ గ్రామానికి చెందిన పైడిపల్లి అర్వింద్ (23) శివరాత్రి సంపత్ (21), శివరాత్రి ఆంజనేయులు (25) ద్విచక్రవాహనంపై తిమ్మాపూర్ మండలం రేణికుంట సమీపంలో రాజీవ్ రహదారిపై ఉన్న టోల్‌గేట్ వద్దకు వచ్చారు. సమీపంలోని దాబాలో భోజనం చేద్దామనుకున్నారు. కానీ.. దాబా క్లోజ్‌చేసి ఉండడంతో తిరిగి రామంచ వెళ్లేందుకు ద్విచక్రవాహనంపై బయల్దేరారు. ఈక్రమంలో రాంగ్ రూట్‌లో వచ్చిన గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న అర్వింద్ అక్కడికక్కడే మృతిచెందగా, అంజి , సంపత్ చికిత్స పొందుతూ కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం తెల్లవారుజామున మరణించారు.


ప్రమాదస్థలంలో మృతుల ద్విచక్రవాహనం

ఇసుక ట్రాక్టరేనా?

రేణికుంట సమీపంలోని మానేరువాగు నుంచి రాత్రి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ వాగులో నుంచి రాజీవ్ రహదారిపైకి రాంగ్ రూట్లో వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ట్రాక్టర్ ఢీకొన్న సమయంలో మరో గుర్తుతెలియని వాహనంకూడా బైక్‌ను ఢీకొన్నట్లు పోలీసు అనుమానిస్తున్నారు. నిర్లక్ష్యంగా రాంగ్ రూట్ లో నడిపిన ట్రాక్టర్ డ్రైవర్ అజయ్, ఓనర్ మహేశ్‌పై పోలీసులు కేసు నమోదుచేశారు.

వారం రోజుల్లో దుబాయ్ వెళ్లాల్సి ఉండగా..

ప్రమాదంలో మృతిచెందిన శివరాత్రి అంజి ఇంటికి పెద్దవాడు అతని ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. తల్లిదండ్రులు మల్లయ్య, లక్ష్మీ వ్యవసాయం తో పాటు కూలీ పనులు చేసుకుంటారు. అంజి ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. ఇంట్లో పెళ్లి సంబంధాలు చూస్తుండడంతో రెండు నెలల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. పెళ్లి కుదరకపోవడంతో ఈనెల 24న తిరిగి దుబాయ్ వెళ్లాలనుకున్నాడు. టిక్కెట్ బుక్ చేసుకున్నాడు. ఇంతలోనే రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.


అంజి (ఫైల్)


సంపత్ (ఫైల్)


అరవింద్ (ఫైల్)

ఒక్కడే కొడుకు..

ప్రమాదంలో మృతిచెందిన శివరాత్రి సంపత్ ఒక్కడే కొడుకు. తల్లిదండ్రులు మహేందర్, రేణుక వ్యవసాయ పనులు చేసుకుంటూ బతుకుతుండగా, సంపత్ కూలీ పనులు చేస్తూ తల్లిదండ్రులకు తోడుగా ఉంటున్నాడు. చేతికి వచ్చిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు కంటతడిపెట్టిస్తున్నాయి.

డ్రైవర్‌గా పనిచేసిన అర్వింద్..

గుడ్డిపెల్లి అర్వింద్‌కు తమ్ముడు చెల్లె ఉన్నారు. అతని తల్లిదండ్రులు రాజు, శైలజ. తండ్రి మహేందర్ ట్రాక్టర్ డ్రైవర్ గా పని చేస్తుండగా తల్లి వ్యవసాయ పనులు చేసుకుంటూ బతుకుతున్నారు. ఎదిగిన కొడుకు చనిపోవడంతో తల్లిదండ్రుల కలిచివేశాయి.

గ్రామంలో విషాద ఛాయలు...

ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు మృత్యువాత పడడంతో గ్రామస్తులు విషాదంలో మునిగారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కలిసి తిరిగిన స్నేహితులు చనిపోయారనే వార్త నమ్మలేకపోతున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

జిల్లా మత్స్య సహకార సంఘం చైర్మన్‌గా నర్సయ్య

పెద్దపల్లిరూరల్: జిల్లా మత్స్యపారిశ్రామిక సహకార సంఘం తొలి చైర్మన్‌గా కొలిపాక నర్సయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం జిల్లా మత్స్యశాఖ అధికారి భాస్కర్‌నాయక్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. 123 సహకార సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సమావేశంలో కొలిపాక నర్సయ్యను చైర్మన్‌గా ఎన్నుకున్నారు. సభ్యులుగా బోగిరి శ్రీకాంత్, పెద్దపల్లి సుజాత, తిప్పని నర్సయ్య, తాళ్ల తిరుపతి, కనకట్ల స్వామి, ముత్యాల వీరస్వామి, సదానందం, బొజ్జల సారయ్య, అనవేని మొగిలి, క్రాంతికుమార్, ఐలవేని వీరస్వామి, సబ్బు మల్లయ్య, రాజేశంను ఎన్నుకున్నారు. నర్సయ్యను పలువురు శాలువాలతో సత్కరించారు. జిల్లాకేంద్రంలోని ప్రధానవీధుల్లో కొలిపాక నర్సయ్య, సభ్యులు ర్యాలీ నిర్వహించారు. మత్స్యశాఖ ఫీల్డ్‌అసిస్టెంట్ రవికుమార్, హరీష్‌కుమార్ ఉన్నారు.


నర్సయ్యను సత్కరిస్తున్న నాయకులు

నీటిలో ముంచి.. ఊపిరి తీసి

- స్నానం కోసం వరదకాలువలోకి తీసుకెళ్లిన భర్త
- భార్యపై అనుమానంతో హత్య

కోరుట్ల: భార్యను అనుమానించి వరదకాలువలో ముంచి చంపాడు ఓ భర్త.. అంతటితో ఆగకుండా నేరం నుంచి తప్పించుకునేందుకు పుట్టింటికి పంపానని అత్తకు ఫోన్‌చేసి చెప్పాడు. జగిత్యాల జిల్లా కోరుట్లలో జరిగిన ఈ ఘాతుకాన్ని పోలీసులు బట్టబయలు చేశారు. సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. జగిత్యాలకు చెందిన ఇర్ఫానా బేగం భర్త అజీజ్ కొన్నేళ్ల క్రితం చనిపోయాడు. ఇళ్లలో పలు పనులు చేసుకుంటూ కుటుంబాన్ని సాకుతోంది. ఏడాదిక్రితం తన కుమార్తె షబానాబీ(21)ని కోరుట్లలోని గంగంపేటలో ఉండే జమీర్(28)కు ఇచ్చి వివాహం జరిపింది. కొద్దిరోజుల తర్వాత షబానాను అనుమానిస్తూ వచ్చిన జమీర్.. సోమవారం ఉదయం 10 గంటల సమయంలో షబానాను జగిత్యాలకు వెళ్లే బస్సు ఎక్కించి పుట్టింటికి పంపానని తన అత్తకు ఫోన్‌చేసి చెప్పాడు. సాయంత్రం వరకూ కూతురు ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన ఇర్ఫానాబేగం.. కోరుట్లకు వచ్చింది. కూతురు తన ఇంటికి రాలేదని జమీర్‌ను అడిగింది. అయితే, తాను బస్సు ఎక్కించానని, ఆమె ఎక్కడికి వెళ్లిందో తెలియదని తప్పించుకున్నాడు.


షబానా బీ(ఫైల్)

దీంతో ఆదేరోజు రాత్రి కోరుట్ల సీఐ ప్రవీణుకుమార్‌కు ఇర్ఫానా ఫిర్యాదు చేసింది. పోలీసులు జమీర్‌ను విచారణ జరపగా.. షబానాను కోరుట్ల బస్టాండ్‌లోనే జగిత్యాలకు వెళ్లే బస్సు ఎక్కించానని చెప్పాడు. ఆ సమయంలో బస్టాండ్‌లోని సీసీ ఫుటేజీలను పోలీసులు పరిశీలించగా ఆ దృశ్యాలేమీ లభించలేదు. దీంతో జమీర్‌ను అనుమానించిన పోలీసులు.. గట్టిగా ప్రశ్నించడంతే.. తానే షబానాను సోమవారం ఉదయం కథలాపూర్ మండలం భూషన్‌రావుపేట శివారులోని వరదకాలువ వద్దకు తీసుకెళ్లానని, స్నానం చేద్దామని లోనికి తీసుకెళ్లి నీటిలో ముంచి చంపానని అంగీకరించాడు. దీంతో మంగళవారం సాయంత్రం సీఐ ప్రవీణ్‌కుమార్, కోరుట్ల, కథలాపూర్ ఎస్సైలు కిరణ్, కిరణ్‌కుమార్ వరద కాలువ వద్దకు వెళ్లి నీటిలో గాలించారు. దీంతో షబానా మృతదేహం లభ్యమైంది. షబానాపై అనుమానంతో భర్త జమీర్ చంపినట్లు సీఐ ప్రవీణకుమార్ తెలిపారు.


మృతదేహాన్ని బయటకు తీస్తున్న స్థానికులు

పర్మినెంట్ కోసం దేశవ్యాప్త ఉద్యమం

- ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షురాలు అపర్ణ


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ దేశవ్యాప్తంగా ఉద్యమం నిర్వహిస్తున్నట్లు ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అపర్ణ, ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం యూనియన్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రెండురోజులపాటు గోదావరిఖనిలో నిర్వహించిన జాతీయ కమిటీ సమావేశాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై చర్చించారు. ప్రభుత్వ రంగసంస్థలను, సంపదను బహుళజాతి సంస్థలకు కారు చౌకగా అమ్మే విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న పర్మినెంట్ కార్మికులను తగ్గించి వారి స్థానంలో కాంట్రాక్టు కార్మికులను పెంచుతున్న ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడాలని తెలిపారు. ఆగస్టు 21 నుంచి 27 వరకు దేశవ్యాప్తంగా ప్రచారం, ఆందోళనలు, ఆగస్టు 15 వరకు అన్ని రాష్ట్రాలలో రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈనెల 21 నుండి 26 వరకు అన్ని రాష్ట్రాలలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్‌తో దేశవ్యాప్త ఆందోళనల్లో కార్మిక వర్గం పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు ప్రసాద్, వీకెపటోలే, ఆశీష్, కుల్వీందర్‌సీంగ్, కె.పోలారి, జోగేంద్ర, వెంకటేశ్వర్లు, ఆర్.జనార్దన్, అరుణ, భారతి, రాజేష్, ప్రతాప్, బి.అశోక్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అత్త ఫించన్.. కోడలి వంచన..

- మూడేళ్లుగా డబ్బులు కాజేస్తున్న కోడలు
- మున్సిపల్ ముందు సొమ్మసిల్లిన అవ్వ
- తలకు తీవ్రగాయాలు

సిరిసిల్లటౌన్: కట్టుకున్నోడు ఏళ్ల కింద కాలం చేశాడు. పెళ్లి వయస్సు రాకముందు పెద్దకొడుకు.. పెళ్లయినంక చిన్నకొడుకు అనారోగ్యంతో చనిపోయారు. అప్పట్నుంచి చిన్న కోడలే ప్రపంచమని బతుకుతున్న ఓ అత్తను కోడలు బురిడీ కొట్టిస్తుంది. అత్త ఆస్తితో పాటు వృద్ధాప్య ఫించన్‌ను మూడేళ్లుగా కాజేస్తున్న ఘటన ఇది. బాధితురాలి వివరాల మేరకు.. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం గాంధీనగర్‌కు చెందిన పత్తిపాక అనసూయమ్మకు ఇద్దరు కొడుకులు. భర్త 40 ఏళ్ల క్రితం చనిపోగా, ఇద్దరు కొడుకులను పెంచి ప్రయోజకులను చేసింది. పెద్దకొడుకు పెళ్లికాక ముందే చనిపోగా, చిన్నకొడుక్కు పెళ్లి చేసింది. వారే లోకంగా అనసూయమ్మ బతుకుతుండగా పదేళ్ల క్రితం చిన్నకొడుకు చనిపోయాడు. ఇదే అదనుగా చిన్నకోడలు భాగ్య అత్తపేరున ఉన్న ఆస్తిని రాయించుకుని పెన్షన్ వచ్చే అకౌంట్ ఏటీఎం కార్డును తన వద్ద ఉంచుకుంది. నెలనెలా వచ్చే పింఛన్ డబ్బులను మూడేళ్లగా డ్రా చేస్తుంది. పింఛన్ తెచ్చుకోవాలని అనసూయ అడిగితే రావడం లేదని చెబుతూ వచ్చింది. ఈక్రమంలో మందులకు డబ్బులు లేకపోవడంతో పింఛన్ ఎందుకు ఇవ్వడం లేదంటూ ఆ వృద్ధురాలు బోరున విలపిస్తూ సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయానికి వచ్చి అక్కడే గేట్ ముందు సొమ్మసిల్లి పడిపోగా, తలకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి వృద్ధురాలి బాధను విన్నాడు. అధికారులను వాకబు చేయగా, నెలనెలా అనసూయ అకౌంట్‌లో పెన్షన్ జమవుతుందని చెప్పడంతో కోడలు బండారం బయటపడింది. తలకు దెబ్బతాకడంతో వెంటనే అనసూయను ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. టౌన్ సీఐ అనిల్‌కుమార్ కోడలుకు కౌన్సెలింగ్ ఇచ్చి ఇద్దరినీ ఇంటికి పంపించారు. కాగా ఆ అవ్వ బాధను విన్న స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు.


వృద్ధురాలిని ఓదార్చుతున్న జిందం చక్రపాణి

జల్సాల కోసం చోరీలు


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ గైక్వాడ్

- ముగ్గురి ముఠా అరెస్టు
- ఐదు ద్విచక్రవాహనాలు స్వాధీనం
- రూ.1.55లక్షల విలువైన ఆభరణాలు కూడా..

జ్యోతినగర్: జల్సాలకు అలవాటు పడి చోరీలు చేస్తున్న ముగ్గురి ముఠాను ఎన్టీపీసీ పోలీసులు పట్టుకున్నారు. వివరాలను ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో పెద్దపల్లి డీసీపీ వైభవ్‌గైక్వాడ్, గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్ మంగళవారం వెల్లడించారు. రామగుండం క్రషర్‌నగర్‌కు చెందిన కొండ రాజేశ్, గోదావరిఖని ఇందిరానగర్‌కు చెందిన శివ కోటేశ్వరరావు కలిసి చోరీలకు పాల్పడుతున్నారు. జల్సాలకు అలవాటు పడి తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసి దొంగతనాలు చేస్తూ.. గోదావరిఖని అడ్డగుంటపల్లికి చెందిన గుర్రాల గంగాధర్‌కు విక్రయిస్తున్నారు. ఇటీవల గౌతమినగర్‌కు చెందిన జాకీర్ ఇంట్లో దొంగతనం జరగడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎన్టీపీసీ, గోదావరిఖని పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితుల గాలిస్తున్నారు. ఎన్టీపీసీ మేడిపల్లి చౌరస్తా వద్ద మంగళవారం ఇద్దరు పాత నిందితులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా.. నేరం చేసినట్లు అంగీకరించారు. దీంతో రాజేశ్, శివకోటేశ్వర్‌రావుతోపాటు వీరి నుంచి ఆభరణాలు కొనుగోలు చేసిన గంగాధర్‌ను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.1.55 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, ఐదు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో చొరవ చూపిన సిబ్బందికి డీసీపీ రివార్డులు అందించారు. రామగుండం సీఐ చంద్రశేఖర్‌గౌడ్, గోదావరిఖని సీఐ ప్రమోద్‌రావు, ఎన్టీపీసీ ఎస్సై జీవన్ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ అందరి బాధ్యత


కార్మికులతో మాట్లాడుతున్న గురువయ్య

గోదావరిఖని: ప్రమాదాల నివారణ ప్రతిఒక్కరి బాధ్యత అని కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య, ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ తెలిపారు. ఓసీపీ–3 కృషిభవన్‌లో కార్మికులతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఓసీపీ–3లో ప్రమాదాలు జరుగకుండా చూడాలని, సురక్షితమైన పని విధానాలు, రక్షణ సూత్రాలు అమలు చేయాలని సూచించారు. సేఫ్టీ మేనేజ్మెంట్ ప్లాన్ ప్రకారం పనిచేయాలని పేర్కొన్నారు. ప్రాజెక్ట్ అధికారి మధుసూదన్, యాక్టింగ్ ఎస్ఓటూ జీఎం బచ్చ రవీందర్, ఓసీపీ–3 మేనేజర్ డి.రమేశ్, సేఫ్టీ అధికారి భరత్‌కుమార్, పిట్ సెక్రెటరీ కొంగర రవీందర్, చర్చల కమిటీ నాయకులు సత్యనారాయణరెడ్డి, అన్ని యూనియన్‌ల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రక్షణపై అవగాహన

గోదావరిఖని: 'నా భద్రత నా బాధ్యత, నా భద్రతే నా కుటుంబ భద్రత' అనే అంశంపై మంగళవారం ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–1 గని బేస్ వర్క్‌షాప్‌లో అవగాహన కల్పించారు. ఓసీపీ–1 ప్రాజెక్టు అధికారి ఎస్.రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆర్జీ–3 ఏరియా ఇంజినీర్ పి.ఎలిషా, రక్షణ అధికారి వెంకటరమణ పలు సలహాలు, సూచనలు చేశారు. ప్రాజెక్టు ఇంజినీర్ ఆర్.శ్రీనివాస్, రక్షణ అధికారి కోటయ్య, బేస్ వర్క్‌షాప్ ఇన్‌చార్జి నజీర్ అహ్మద్, పి.భద్రాచలం, జక్కుల దామోదర్, కె.కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రక్షణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

గూడ్స్ రైలు నుంచి పొగలు

- బొగ్గుకు అంటుకున్న నిప్పు
- రాఘవాపూర్ రైల్వేస్టేషన్ వద్ద నీరు చల్లిన ఫైర్‌సిబ్బంది

పెద్దపల్లిరూరల్: గూడ్స్ రైలు బోగి నుంచి పొగలు రావడంతో పెద్దపల్లి అగ్నిమాపక సిబ్బంది నీళ్లు చల్లి చల్లార్చారు. గోదావరిఖని నుంచి నిజామాబాద్‌కు బొగ్గు లోడ్‌తో వెళ్తున్న గూడ్స్ రైలు ఇంజిన్ వెనక ఉన్న బోగి నుంచి పొగలు వెలువడుతుండడాన్ని రైలు సిబ్బంది గమనించి అప్రమత్తమయ్యారు. రైలును రాఘవాపూర్ రైల్వేస్టేషన్ వద్ద నిలిపి పెద్దపల్లి అగ్నిమాపకశాఖ అధికారి దేవనంది శ్రీనివాస్‌కు సమాచారం అందించారు. ఆయన హుటాహుటిన సిబ్బందితో చేరుకుని నీరు చల్లి నిప్పురవ్వలను చల్లార్చారు. సకాలంలో గుర్తించి ఆర్పడం వల్ల పెద్ద నష్టం తప్పింది. అగ్నిమాపక సిబ్బంది సిరాజుద్దీన్, చంద్రయ్య, శ్రావణ్‌కుమార్, నరేందర్, రైల్వే పోలీసులు, అధికారులున్నారు.


నిప్పును చల్లార్చుతున్న అగ్నిమాపక సిబ్బంది

బైక్ చెట్టుకు ఢీకొని యువకుడి మృతి

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన బస్వపత్రి సంతోష్ (26) సోమవారం రాత్రి జరిగిన ప్రమాదంలో మృతిచెందాడు. సంతోష్ మండల కేంద్రం నుంచి పెగడపల్లికి బైక్‌పై వెళ్తుండగా.. మార్గంమధ్యలో బైక్ అదుపు తప్పి చెట్టుకు ఢీకొని మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. తలకు బలమైన దెబ్బలు తగలడంతోనే మృతి చెందినట్లు గ్రామస్తులు భావిస్తున్నారు. మృతుడి తండ్రి సదానందం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఎదిగిన కుమారుడు అకాల మరణంతో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి. మృతుడి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, సర్పంచు ఆరెల్లి సుజాత, ఎంపీటీసీ సుముకం నిర్మల తదితరులు ఓదార్చారు.


సంతోష్ (ఫైల్)


రోధిస్తున్న కుటుంబ సభ్యులు

అత్తారింటి వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య

జూలపల్లి: అత్తింటివారి వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలకేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై వెంకటకృష్ణ కథనం ప్రకారం.. ఓదెల మండలం కొలనూర్‌కు చెందిన గొర్రె రమ్యకు మండల కేంద్రానికి చెందిన పాటకుల నరేశ్‌తో 11 ఏళ్ల క్రితం పెళ్లయ్యింది. సంతానం లేకపోవడంతో భర్త నరేశ్ ఆమెను వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ క్రమంలో కొంతకాలంగా ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. నరేశ్ అక్క ఐత పద్మ కూడా ఆమెను వేధింపులకు గురిచేస్తోంది. దీంతో మనస్తాపానికి గురైన రమ్య సోమవారం మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్లి అక్కడ గడ్డి మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. మంగళవారం ఉదయం చనిపోయింది. మృతురాలి చెల్లెలు గొర్రె కోమలత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


రమ్య మృతదేహం